సంపుటి :02 సంచిక :259 పేజీలు :05 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

మంగళవారం 22, డిసెంబర్ 2025


## మావోయిస్టుల ఆయుధ కర్మాగారం ధ్వంసం

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మాలో ఘటన 02



## పోలీసు శాఖలో కలకలం

- ముగ్గురు పోలీసు అధికారుల సస్పెన్షన్ 02
- వారిలో ఏసీపీ, ఇన్‌స్పెక్టర్, ఎస్సై
- ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ



# భారత రాజ్యాంగం పట్ల విధేయుడనై!


పల్లె పాలనలో కొత్త అధ్యాయం మొదలైంది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ పంచాయతీలకు ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు సోమవారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. 'భారత రాజ్యాంగం పట్ల నిజమైన నమ్మకం.. విధేయత కలిగి ఉంటానని.. నా విధులను నమ్మకంగా నిర్వహిస్తా'నని దైవసాక్షిగా ప్రతిజ్ఞ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 1,682 పంచాయతీల్లో ప్రమాణ స్వీకారోత్సవాలు సంబురంగా సాగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కొత్త పాలకవర్గాలు కొలువుదీరడంతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది. 22 నెలలుగా ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్న పంచాయతీల్లో ఒక పాలన, ప్రగతి పరుగులు పెట్టనున్నాయి.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

### పల్లెల్లో కొలువుదీరిన కొత్త పాలకవర్గాలు

- ఇక ప్రత్యేక అధికారుల పాలనకు ఫుల్‌స్టాప్
- ఉమ్మడి జిల్లాలో కొత్తగా 1,682 మంది సర్పంచ్‌లు
- పంచాయతీల్లో పట్టాలెక్కనున్న పాలన
- పండుగ వాతావరణంలో ప్రమాణ స్వీకారోత్సవాలు
- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

2




## రణరంగంగా చెన్నారావుపేట

- సర్పంచ్‌ల ప్రమాణ స్వీకారంలో వాగ్వాదం
- స్పీకర్లలో బీఆర్ఎస్ పాటలు ప్లే చేయడంపై కాంగ్రెస్ నేతల అభ్యంతరం
- తమ పాటలే వస్తాయని గులాబీ శ్రేణుల స్పష్టీకరణ
- వాగ్వాదంతో మొదలై రెండు వర్గాల మధ్య ఘర్షణ


4










# భారత రాజ్యాంగం పట్ల విధేయుడనై !

- పల్లెల్లో కొలువుదీరిన కొత్త పాలకవర్గాలు
- ఇక ప్రత్యేక అధికారుల పాలనకు ఫుల్‌స్టాప్
- ఉమ్మడి జిల్లాలో కొత్తగా 1,682 మంది సర్పంచ్‌లు
- పంచాయతీల్లో పట్టాలెక్కనున్న పాలన
- పండుగ వాతావరణంలో ప్రమాణ స్వీకారోత్సవాలు
- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: పల్లె పాలనలో కొత్త అధ్యాయం మొదలైంది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ పంచాయతీలకు ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు సోమవారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. `భారత రాజ్యాంగం పట్ల నిజమైన నమ్మకం.. విధేయత కలిగి ఉంటానని.. నా విధులను నమ్మకంగా నిర్వహిస్తా`నని దైవసాక్షిగా ప్రతిజ్ఞ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 1,682 పంచాయతీల్లో ప్రమాణ స్వీకారోత్సవాలు సంబురంగా సాగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కొత్త పాలకవర్గాలు కొలువుదీరడంతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది. 22 నెలలుగా ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్న పంచాయతీల్లో ఒక పాలన, ప్రగతి పరుగులు పెట్టన్నాయి.

### - 1,008 స్థానాల్లో కాంగ్రెస్

మొత్తం 1,684 స్థానాల్లో కాంగ్రెస్ మద్‌తుతో గెలిచిన సర్పంచ్‌లు 1,008 మంది కొలువుదీరారు. బీఆర్ఎస్ మద్దతుతో 494 మంది సర్పంచ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే బీజేపీ నుంచి 39 మంది, వామ పక్షాల నుంచి ముగ్గురు, స్వతంత్రులుగా 138 మంది విజయం సాధించారు. స్వతంత్రంగా పోటీ చేసి గెలిచిన 120 మందికి పైగా సర్పంచ్‌లు కాంగ్రెస్ గూటికి చేరే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్‌లో ఆ పార్టీ రెబల్సే కాబట్టి వారంతా హస్తం గూటికి చేరడం పక్కా అనే ప్రచారం జరుగుతున్నది. బీఆర్ఎస్ సర్పంచ్‌లు గెలిచిన చోట ఉప సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు ఉన్నారు. కాంగ్రెస్ సర్పంచ్‌లు ఉన్న పలెల్లో బీఆర్ఎస్, బీజేపీకి చెందిన ఉపసర్పంచ్‌లు ఉన్నారు. పాలన మొత్తం సర్పంచ్ చేతిలో ఉన్నప్పటికీ, చెక్ పవర్ మాత్రం ఉప సర్పంచ్‌ల చేతిలో ఉండటంతో వారే బిల్లులు డ్రా చేయాల్సి ఉంటుంది. దీంతో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌ల మధ్య సమన్వయం తప్పనిసరి. ఈ విషయంలో ఏం జరుగుతుందోనని సర్వత్రా చర్చ మొదలైంది.

### - పట్టాలెక్కనున్న పాలన

రేపటి నుంచి పల్లెల్లో ప్రజాపాలన పట్టాలెక్కనుంది. గ్రామ సమస్యలపై అవగాహన, అభివృద్ధి చేయాలనే తపన ఉన్న యువత, ఉన్నత విద్యావంతులు ఈసారి పెద్ద సంఖ్యలో సర్పంచులుగా ఎన్నికవ్వడం గమనార్హం. ముఖ్యంగా మహిళా సర్పంచుల సంఖ్య 50 శాతానికి పైగా ఉండటం గ్రామాల్లో మార్పుకు సంకేతంగా కనిపిస్తున్నది. కొలువుదీరిన ఈ పాలక వర్గాల ముందు అనేక సవాళ్లతో పాటు బాధ్యతలు కూడా ఉన్నాయి. గ్రామంలో మౌలిక వసతుల కల్పన, అంతర్గత రహదారుల నిర్మాణం, పారిశుద్ధ్యం వంటి కీలక అంశాలపై దృష్టి సారించాల్సి ఉంది. ప్రతి గ్రామంలోనూ ఐదేళ్ల పాలన ముగిసేసరికి మట్టి రోడ్డు అనేది లేకుండా, ఉపాధి నిధులను సమర్థవంతంగా వినియోగించుకుని సీసీ రోడ్లను నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం, ప్రజారోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంటింటా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, మురుగు కాల్వల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపినప్పుడే గ్రామాలు ఆదర్శంగా నిలుస్తాయి. డోర్నకల్ మండలంలోని చాప్లాతండా లాంటి గ్రామాలు ఈ విషయంలో ఇప్పటికే ఆదర్శంగా నిలిచాయి. అలాగే, రాత్రిళ్లు గ్రామాలు అంధకారంలో ఉండకుండా అన్ని వార్డుల్లో ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేయడం, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల పనితీరును పర్యవేక్షించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించవచ్చు. స్వచ్ఛమైన తాగునీరు అందించడం, ట్యాంకుల శుభ్రత, ఇంటింటికీ ఇంకుడు గుంతల నిర్మాణం వంటి పనులు గ్రామస్తుల జీవన ప్రమాణాలను పెంచుతాయి.

### - నిధుల సద్వినియోగం అవసరం

ఆర్థికంగా గ్రామాలను బలోపేతం చేసేందుకు కేంద్ర ఆర్థిక సంఘం నిధులు కీలకం కానున్నాయి. పాలక వర్గాలు లేని కారణంతో నిలిచిపోయిన సుమారు రూ.3,000 కోట్ల నిధులను కేంద్రం నుంచి సాధించుకోవడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం ఎన్నికలు నిర్వహించింది. ఈ నిధులు సకాలంలో అందితే గ్రామాల్లో పేరుకపోయిన పాత బకాయిలు చెల్లించడంతో పాటు, కొత్త అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంటుంది. గంగదేవిపల్లి, మరియపురం వంటి ఆదర్శ గ్రామాలను స్ఫూర్తిగా తీసుకుని, కమిటీల ఏర్పాటు ద్వారా ప్రజలను భాగస్వామ్యం చేస్తూ అభివృద్ధి ప్రణాళికలు రచించాలి. సర్పంచులు తమ విధుల్లో పారదర్శకతను పాటించి, ప్రతి నిర్ణయాన్ని గ్రామసభ ద్వారా తీసుకోవాల్సి ఉన్నది. పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి. సర్పంచులు గ్రామాల్లోనే నివసిస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలి. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. ఎమ్మెల్యేలు, ఎంపీలు వంటి ప్రజాప్రతినిధులను గ్రామసభలకు ఆహ్వానిస్తూ, వారి సహకారంతో పల్లెలను ప్రగతి పథంలో నడిపించాల్సిన బాధ్యత ఇప్పుడు కొత్త సర్పంచుల భుజాలపై ఉంది. రేపటి నుంచి ప్రారంభం కానున్న ఈ నూతన పాలనతో పల్లె సీమలు సుభిక్షంగా మారుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

# అత్యంత వేగంగా పూర్తి చేయాలి

- సబ్ స్టేషన్ల రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ పనులపై టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ
- ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓలతో వీడియో కాన్ఫరెన్స్




అక్షరదర్బార్, హనుమకొండ: విద్యుత్ సబ్‌స్టేషన్ల రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ పనులను పెండింగ్ లేకుండా అత్యంత వేగంగా పూర్తి చేయాలని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. హన్మకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ కార్పొరేట్ కార్యాలయం నుంచి 17 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏవోలతో ఆయన సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ జనవరి 15లోపు హెచ్‌టీ సర్వీసులకు ఆటోమెటిక్ మీటర్ రీడింగ్ (ఏఎంఆర్) ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఇకపై కొత్తగా విడుదల చేసే సర్వీసులు కూడా ఏఎంఆర్ ద్వారా పర్యవేక్షణలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి డివిజన్లో హై-లాస్ ఫీడర్లను గుర్తించి, వాటిపై క్షుణంగా పరిశీలన చేసి పెట్రోలింగ్ నిర్వహించి నష్టాలకు కారణాలను విశ్లేషించి తగ్గించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న 33కేవీ ఇంటర్ లింకింగ్ పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. బంచింగ్ ఫీడర్లను వేరు చేసి లైన్ సిస్టమ్స్ చక్కదిద్దాలని అన్నారు. రెండు నెలల్లో వ్యవసాయ సర్వీసులు మరింతగా పెరిగేలా చూడాలని తెలిపారు. హెచ్ టీ సింగిల్ విండో సెల్‌లో సర్వీసుల మంజూరును వేగవంతం చేసి, టీజీ ఐపాస్, నాన్ టీజీ ఐపాస్ దరఖాస్తులు పెం డింగ్ లేకుండా చూడాలని సూచించారు. నాన్ ఐఆ ర్డీఏ మీటర్లు ఉన్న చోట్ల ఐఆర్డీఏ మీటర్లు అమర్చాల ని, ఓసీఆర్ ద్వారా బిల్లింగ్ 100% పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్లు మోహన్ రావు, తిరుపతి రెడ్డి, మధుసూదన్, సీఈలు సదర్ లాల్, రాజు చౌహన్, అశోక్, వెంకటరమణ, అన్నపూర్ణ, సురేందర్, సీజీఎంలు చరణ్ దాస్, కిషన్, జీఎంలు వేణుబాబు, కృష్ణమోహన్, వెంకటకృష్ణ, శ్రీనివాస్, వాసుదేవ్, నాగప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.




# మావోయిస్టుల ఆయుధ కర్మాగారం ధ్వంసం

### - ఛత్తీస్ గఢ్ లోని సుక్మాలో ఘటన

అక్షరదర్బార్, హైదరాబాద్ : ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మీనగట్టా అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు భారీ ఆయుధ కర్మాగారాన్ని ధ్వంసం చేశాయి. సీఆర్‌పీఎఫ్ 150వ బెటాలియన్, సుక్మా పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టారు. అడవిలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారంతో బలగాలు కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలోనే మావోయిస్టులు దాచిన భారీ ఆయుధాల డంప్ గుర్తించారు. ఈ స్థావరం నుంచి ఎనిమిది సింగిల్ షాట్ రైఫిల్స్ స్వాధీనం చేసుకున్నారు. భారీ మొత్తంలో పేలుడు పదార్థాలు కూడా లభించాయి. వీటిలో అమ్మోనియం నైట్రేట్ మరియు ఎలక్ట్రిక్ డెటోనేటర్లు ఉన్నాయి. ఎనిమిది వైర్‌లెస్ సెట్లతో పాటు తుపాకుల తయారీకి వాడే వెల్డింగ్ మిషన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల యూనిఫామ్స్ లభ్యమయ్యాయి. ఆయుధ కర్మాగారం ధ్వంసంతో మావోయిస్టుల ప్రణాళికలు దెబ్బతిన్నాయని సుక్మా ఎస్పీ కిరణ్ చౌహాన్ తెలిపారు. భద్రతా బలగాలపై దాడులు చేసేందుకే వారు ఇక్కడ ఆయుధాలు తయారు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. 2026 మార్చి నాటికి జిల్లాలో మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని ఆయన వివరించారు. ఈ ఏడాది ఇప్పటికే భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోవడం లేదా ఎన్‌కౌంటర్లలో మరణించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు.

# పోలీసు శాఖలో కలకలం

- ముగ్గురు పోలీసు అధికారుల సస్పెన్షన్
- వారిలో ఏసీపీ, ఇన్ స్పెక్టర్, ఎస్సై
- ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ



ఏసీపీ నందిరాం నాయక్

అక్షరదర్బార్, హనుమకొండ : విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడ్డారని ముగ్గురు పోలీస్ అధికారులపై పోలీస్ శాఖ బాస్ వేటు వేశారు. ఒక ఏసీపీ, ఇన్ స్పెక్టర్, ఎస్సైని సస్పెన్షన్ చేశారు. వీరిలో గతంలో వరంగల్ ఏసీపీగా విధులు నిర్వహించిన నందిరాంనాయక్ తో పాటు మట్టెవాడ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ గా పనిచేసి ప్రస్తుతం సీసీఎస్ ఇన్ స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న టి గోపి, మట్టెవాడ పోలీస్ స్టేషన్ లో పనిచేసిన ఎస్ఐ విఠల్ ఉన్నారు. ఏసీపీ నందిరాంనాయక్, ఇన్ స్పెక్టర్ టి గోపి, ఎస్సై విఠల్ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేసే సమయంలో మట్టెవాడ పోలీస్ స్టేషన్ లో తప్పుడు కేసులు నమోదు చేసినట్లు ఫిర్యాదు రావడంతో దీనిపై ఇటీవల అధికారులు విచారణ జరిపారు. విచారణ అధికారులు అందజేసిన నివేదిక ఆధారంగా ఈ ముగ్గురు పోలీస్ అధికారులను సస్పెన్షన్ చేస్తూ సోమవారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అనూహ్యంగా ఒకేసారి ముగ్గురు పోలీస్ అధికారులపై సస్పెన్షన్ వేటు పడటం, ఆ ముగ్గురిలో ఒక ఏసీపీ, ఇన్ స్పెక్టర్, ఎస్ఐ ఉండటం పోలీసు శాఖలో కలకలం రేపింది.





# అయ్యప్పస్వామికి వైభవంగా అభిషేకాలు

- **కన్నుల పండుగగా పడిపూజ**
- **పడిపూజ దాతగా గీతాంజలి డిజి స్కూల్ చైర్మన్ వేములపల్లి జయశ్రీ సుబ్బారావు**
- **అన్నదాన దాతలుగా శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప మిత్రబృందం, ఇతర దాతలు**

అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో 25 వ సిల్వర్ జూబ్లీ మండల పూజలు ప్రారంభమైన నేపథ్యంలో సోమవారం అయ్యప్పస్వామి మహాదివ్య పడిపూజ వైభవంగా జరిగింది. నర్సంపేట శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సింగిరికొండ మాధవశంకర్ గుప్తా,అధ్యక్షుడు సైపా సురేష్,ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి,కోశాధికారి దొడ్డ రవీందర్ గుప్తా సమక్షంలో నర్సంపేట పట్టణ గీతాంజలి డిజి స్కూల్ అధినేత వేములపెల్లి జయశ్రీ సుబ్బారావు, వేములపల్లి అపర్ణ రాహుల్ చౌదరి, బత్తుల రచన చౌదరి, లక్ష్మి బాలాజీ సాయి విశ్వనాథ్ కుటుంబ సభ్యులు పడిపూజ దాతలుగా ఉన్నారు.దేవాలయ ప్రధాన అర్చకులు దేవేశ్ మిశ్రా వేదమంత్రాలతో అయ్యప్పస్వామి పడిపూజను కన్నుల పండుగగా నిర్వహించారు.ఉదయం గర్భగుడిలో సుప్రభాతంతో మొదలై గణపతిహోమం కార్యక్రమం,ప్రత్యేక పూజలు చేపట్టారు.అనంతరం అయ్యప్పస్వామికి అష్టాభిషేకాలు కళాశాభిషేకాలు చేయగా భక్తులు ఎంతగానో తరించిపోయారు.అయ్యప్ప స్వామిపైన వివిధ రకాల పుష్పాలతో సామూహిక పుష్పాభిషేకం నిర్వహించారు. అనంతరం దేవాలయం పదునెట్టాంబడిపై కర్పూరలో వెలిగించగా జ్యోతిరూపంలో కనిపించగా ఆలయ ప్రాంగణం చుట్టుపక్కల అయ్యప్పస్వామి నామస్మరణతో మారుమ్రోగింది.మండల పూజల్లో భాగంగా నిర్వహిస్తున్న మహా అన్నదాన కార్యక్రమం సోమవారం నాటికి 39 వ రోజుకు చేరుకున్న తరుణంలో అన్నదాతలుగా అయ్యప్ప దేవాలయ గురుస్వామి బొట్ల నాగరాజు ఆధ్వర్యంలో శ్రీధర్మ శాస్త్ర అయ్యప్ప మిత్రబృందంతో పాటు సాయి సుప్రీత కర్షన్, దొడ్డ సాయి భవన, లింగాల సంధ్య రణధీర్ రెడ్డి ఉన్నారు.

### గజమాలతో సత్కారం

పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించిన దాతలు గీతాంజలి డిజీ స్కూల్ చైర్మన్ వేములపల్లి జయశ్రీ సుబ్బారావు కుటుంబ సభ్యులను శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి దేవాలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో గజ మాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఇరుకు కోటేశ్వర్ రావు, చెంచారావు,పాలకుర్తి శ్రీనివాస్, మల్యాల ప్రవీణ్ కుమార్, మల్యాల రాజు,గురుస్వాములు సంజీవ రావు,బొట్ల నాగరాజు,యాదగిరి, రాయసాబ్,అంకూస్ గౌడ్,శ్రీధర్మశాస్తా అయ్యప్ప మిత్రబృందం, చంద్రమౌళి గౌడ్,భరత్,రాజు,కందుల శ్రీనివాస్ గౌడ్,మాలాదారులు,భక్తులు పాల్గొన్నారు.

# గ్రామ ప్రథమ పౌరుడిగా మహేందర్ రెడ్డి

- **అంగరంగ వైభవంగా ప్రమాణస్వీకారం**
- **శుభాకాంక్షలు తెలిపిన గ్రామస్తులు**

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామ నూతన సర్పంచ్‌గా పెండ్యాల మహేందర్ రెడ్డి సోమవారం అంగరంగ వైభవంగా ప్రమాణస్వీకారం చేశారు. గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వంగపల్లి క్లస్టర్ ఏఈవో జయప్రకాష్ రెడ్డి సమక్షంలో మహేందర్ రెడ్డి తో పాటు ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామంలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి, అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన–మన అనే తేడా లేకుండా గ్రామస్తుల సహకారంతో వెంకటేశ్వర్లపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో గ్రామస్తులు వీక్షించి నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధిపై ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.




# మొట్లపల్లి గ్రామ సర్పంచ్ గా నరహరి వెంకటరెడ్డి బాధ్యతలు స్వీకరణ

- **హాజరైన మాజీ జెడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి**
- **25 ఏళ్లుగా గ్రామంలో ఏక చక్రాధిపత్యం**

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్ళపల్లి మండలం మొట్లపల్లి గ్రామ సర్పంచిగా నరహరి వెంకటరెడ్డి సోమవారం ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. గ్రామ స్పెషల్ ఆఫీసర్ లింగాల కుమారస్వామి నరహరి వెంకట్ రెడ్డితో నూతన సర్పంచిగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయనతోపాటు ఉప సర్పంచ్ 9 మంది వార్డు సభ్యులు ప్రమాణం చేశారు.

### 25 సంవత్సరాలుగా ఏకచక్రాధిపత్యం.

మొట్లపల్లి గ్రామంలో.. మాజీ పురపాలక శాఖ మాత్యులు మాదాడి నరసింహారెడ్డి సోదరుడు మాదాడి సీతారాం రెడ్డి మొట్లపల్లి గ్రామ సర్పంచిగా చేసిన అనంతరం వారి తర్వాత ఇదే గ్రామానికి చెందిన సాధ సంజీవరెడ్డి ఏకగ్రీవంగా సర్పంచ్ పదవికి ఎన్నికయ్యారు ఆయన తదనంతరం నరహరి వెంకట్ రెడ్డి గ్రామంలో తన అనుచరులను సర్పంచి బరిలో నిలబెట్టి గెలిపించుకుంటూ వస్తున్నాడు గత సర్పంచిగా తన సతీమణి నరహరి పద్మ వెంకటరెడ్డి గెలుపొందగా 2025 లో వచ్చిన సర్పంచి ఎన్నికలలో మొట్లపల్లి జనరల్ కు రావటంతో తాను స్వయంగా నిలబడి తన సోదరుడు నరహరి భక్కీరెడ్డిపై 175 ఓట్ల మెజారిటీతో విజయం సాధించాడు. అధికార పార్టీ బలపరిచిన నరహరి భక్కీరెడ్డి విజయం కోసం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రచారం నిర్వహించిన.? నరహరి వెంకటరెడ్డి గెలుపొందడం గమనార్హం. నరహరి వెంకటరెడ్డి కోసం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రచార షెడ్యూల్ ప్రకటించిన చివరి క్షణంలో రద్దుచేసి ఒకే ఒక్కడు గ్రామంలో ఇంటింటి ప్రచారం చేసి ఆరుగురు వార్డు సభ్యులను గెలిపించుకోవడంతో పాటు తాను ఎన్నికల బరిలో నిలబడి విజయం సాధించారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న సర్పంచ్ వెంకటరెడ్డి, వార్డు సభ్యులు


సర్పంచ్ ను సన్మానిస్తున్న మాజీ జెడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి

### గ్రామాన్ని రక్షించే వారికి పట్టం కట్టారు.

**మాజీ జెడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి**

గ్రామాన్ని అన్ని విధాల్లో అభివృద్ధిలో రాష్ట్రస్థాయి తో పాటు జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దిన నరహరి పద్మ వెంకటరెడ్డి సేవలను గుర్తించిన గ్రామ ప్రజలు వెంకట్ రెడ్డికి సర్పంచ్ పదవి కట్టబెట్టడం హర్షణీయమని మాజీ జెడ్పి చైర్ పర్సన్ శ్రీమతి గండ్ర జ్యోతి తెలిపారు మొట్లపల్లి గ్రామ సర్పంచ్ నరహరి వెంకట్ రెడ్డి ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె ప్రజలను ఉద్దేశించి సుదీర్ఘంగా ప్రసంగించారు. గత 25 సంవత్సరాలుగా ఏకచక్రాధిపత్యంగా గ్రామంలో విజయం సాధిస్తూ నరహరి వెంకటరెడ్డి గ్రామ ప్రజలకు చేస్తున్న సేవలు అపూర్వమని రానున్న రోజులలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని తెలిపారు. గతంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డి ఆశీస్సులతో గ్రామంలో ఎంతో అభివృద్ధి జరిగిందని దానికి నిదర్శనమే ఈ ఎన్నిక ఫలితాలని ఆమె తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లింగాల కుమారస్వామి, కార్యదర్శి సుజాత, మాజీ ఎంపిటిసి నరహరి సుధాకర్ రెడ్డి, కారోబార్ వెంకటేష్, ఉపసర్పంచ్ ఆళ్ల ముత్యంరెడ్డి వార్డు మెంబర్లు చిలుకూరి జగన్ రెడ్డి గూడూరు శ్రీనివాసరెడ్డి బజ్జూరి రామకృష్ణ బజ్జూరి వేణు ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# అలియాబాద్ సర్పంచ్ గా సనత్ ప్రమాణ స్వీకారం

అక్షరదర్బార్, పరకాల: పరకాల మండలం అలియాబాద్ గ్రామ నూతన సర్పంచిగా శాతరాశి సనత్ కుమార్ పటేల్ సోమవారం అంగరంగ వైభవంగా ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామపంచాయతీ ఆవరణలో పరకాల నయాబ్ తాహసిల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సనత్ కుమార్ పటేల్ మాట్లాడుతూ, “సనత్ అనే నేను అలియాబాద్ గ్రామ అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉంటాను. కుల, మత, వర్గ భేదాలను పక్కనబెట్టి పార్టీలకతీతంగా గ్రామ ప్రజలందరికీ సమానంగా సేవ చేస్తాను” అని పేర్కొన్నారు. గ్రామంలో ఉన్న మౌలిక వసతుల సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తూ ప్రజల మనసులు గెలుచుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతానని చెప్పడంతో సభలో హాజరైన గ్రామస్తులు కరతాళ ధ్వనులతో ఆయనకు శుభాభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# కొలువుదీరిన కొత్త పాలకవర్గాలు

- గ్రామపంచాయతీలో ప్రమాణస్వీకారాలు
- ఆదర్శ పాలన అందిస్తాం
- నూతన సర్పంచుల మనోగతం

అక్షర దర్బార్, వెంకటాపూర్ : పల్లె జనాలని మెప్పించి.. ఎన్నికల్లో గెలుపొంది వారి మేలు కోసం సర్పంచులు పల్లెలో నూతన ఆదర్శవంతమైన పాలన అందిస్తామని సర్పంచులుగా ప్రమాణస్వీకారం చేసిన సర్పంచులు వేదికముందు బహిర్గతం చేశారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామపంచాయతీలో నూతనంగా సర్పంచిగా పదవి స్వీకరం చేసిన సర్పంచులు మరియు ఉప సర్పంచ్లు, వార్డ్ మెంబర్లు తమ మనోగతాన్ని వివరించారు. తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తామని, గ్రామ అభివృద్ధి తమ మొదటి కర్తవ్యం గా స్వీకరిస్తామని సభ ముఖంగా తెలియజేశారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధితోపాటు, సంక్షేమం లక్ష్యంగా తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే ప్రణాళిక రూపొందించుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ అయిన వెంకటాపూర్ గ్రామ నూతన సర్పంచిగా మామిడి శెట్టి సుగుణ స్వామి, ఎల్లారెడ్డిపల్లి గ్రామ నూతన సర్పంచిగా భాష బోయిన పోశాలు యాదవ్, నల్లగుంట గ్రామ నూతన సర్పంచిగా బానోతు శ్రీదేవి శంకర్, లక్ష్మీదేవి పేట గ్రామ నూతన గ్రామ సర్పంచిగా బొమ్మ కంటి వంశావతి రమేష్, నర్సింగాపూర్ గ్రామ సర్పంచ్ గా రమేష్, బూర్గుపేట గ్రామ సర్పంచ్ గా సేద లక్ష్మి సారంగం, నారాయణపురం గ్రామ సర్పంచ్ గా లక్ష్మి, పాలంపేట గ్రామ సర్పంచిగా చల్లగొండ రాజు, నారాయణగిరి పల్లె నూతన గ్రామ సర్పంచిగా అన్న రవి పదవి బాధ్యతలు స్వీకరించారు.

### ఆనందంగా ఉంది

**భాషబోయిన పోశాలు యాదవ్, ఎల్లారెడ్డిపల్లి సర్పంచ్**



సర్పంచిగా గెలవడం ఆనందంగా ఉంది. నేటి నుంచి పదవి బాధ్యతలు చేపట్టడం మరిచిపోలేని అనుభూతి, గ్రామంలోని సమస్యలను అన్ని వర్గాలతో చర్చించి పరిష్కరించేలా ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామంలో అన్ని రకాల పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేసి గ్రామ అభివృద్ధికి పాటుపడుతూ ముందుకు సాగుతా...!!

### గ్రామ అభివృద్ధి ధ్యేయం

**వెంకటాపూర్ సర్పంచ్, మామిడిశెట్టి సుగుణ**



గ్రామ అభివృద్ధి తన తక్షణ కర్తవ్యం గా నిర్వర్తిస్తానని, ప్రజలు సేవ చేస్తానన్న నమ్మకంతో  ఈసారి ప్రజలు తనకు పట్టం కట్టారని, గ్రామంలోని మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తా, వార్డు సభ్యుల సహకారంతో అభివృద్ధి పనులు చేపడతా. అని వెంకటాపూర్ నూతన గ్రామ సర్పంచ్ మామిడిశెట్టి సుగుణ స్వామి పేర్కొన్నారు.

### పెండింగ్ పనులు పూర్తి చేయి


**చల్లగొండ రాజు, పాలంపేట సర్పంచ్**



గ్రామపంచాయతీ పరిధిలో పెండింగ్లో ఉన్న ప్రతి పని పూర్తి చేసేందుకు కృషి చేస్తా ప్రజలు నాకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా. అందరికీ నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తా.

# గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యం

**భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



అక్షర దర్బార్, శాయంపేట: గ్రామీణ అభివృద్దే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. సోమవారం శాయంపేట మండలంలో ఎమ్మెల్యే పర్యటించి శాయంపేట, పత్తిపాక, జోగంపల్లి, పెద్దకోడెపాక గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్లు మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్లు, పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల ఆశయాలను నెరవేర్చేలా పాలకవర్గాలు నిత్యం ప్రజల మధ్య ఉండి పనిచేయాలని సూచించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, ఆరోగ్య రంగాల్లో ప్రజా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమం అనంతరం పలువురు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును శాలువాలతో సన్మానించారు.



# ద లీడర్

- ఒంటి చేత్తో గెలుపు మంత్రం!
- ఉత్కంఠలో చిరునవ్వుతో విజయకేతనం..
- నర్సక్కపల్లిలో బీఆర్ఎస్ విజయానికి నాగుర్ల వ్యూహం



అక్షరదర్బార్, పరకాల : తీవ్ర ఉత్కంఠ నడుమ చిరునవ్వుతో విజయకేతనం ఎగరవేసింది బీఆర్ఎస్. హనుమకొండ జిల్లా నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ సమీకరణాలను ఒంటి చేత్తో మార్చిన తెలంగాణ రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్, నర్సక్కపల్లి ముద్దుబిడ్డ నాగుర్ల వెంకటేశ్వర్లు మరోసారి తన నాయకత్వ సత్తాను నిరూపించారు. కాంగ్రెస్ ప్రచారంతో పెరిగిన ఉత్కంఠ నడుమ నర్సక్కపల్లిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సహా పరకాల పట్టణం, జిల్లా స్థాయి నాయకులు గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని విస్తృత ప్రచారం నిర్వహించారు. ఒక దశలో కాంగ్రెస్ విజయమే ఖాయమన్న ప్రచారం జోరందుకోగా, గెలుపు సంబరాలకు సైతం సిద్ధమయ్యారనే చర్చ సాగింది.

### - శపథాలు... గందరగోళం.. కీలక మలుపు..

కాంగ్రెస్ నాయకులు ప్రచారాన్ని మరింత ముమ్మరం చేస్తూ 'ఈ గ్రామంలో కాంగ్రెస్ గెలవకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటాం' అంటూ శపథాలు చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అదే సమయంలో బీఆర్ఎస్ అభ్యర్థి కొంతసేపు కనిపించకపోవడంతో గ్రామంలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. రెండు గంటల్లోనే పరిస్థితిని గమనించిన నాగుర్ల వెంటనే రంగంలోకి దిగారు. కేవలం రెండు–మూడు గంటల వ్యవధిలోనే గ్రామస్థులతో మాట్లాడి, ఎన్నికల వ్యూహాన్ని సిద్ధం చేసి అమలు చేశారు. ఆ వ్యూహమే ఫలితం రూపంలో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీని అందించింది. ఫలితాల వెల్లడితో విస్మయానికి గురైన ప్రత్యర్థులు ఎన్నికల ఫలితాలు వెలువడగానే బీఆర్ఎస్ విజయం సాధించడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ గెలుపునకు కారణం ఒక్క నాగుర్లేనని గ్రామస్తులు ఏకగ్రీవంగా అభిప్రాయపడుతున్నారు. ప్రజలతో మమేకమైన నాయకుడే నిజమైన లీడర్. 'అధికారం ఉన్నా లేకున్నా ప్రజలతో కలిసిమెలిసి ఉండేవాడే అసలైన నాయకుడు. మా కష్ట సుఖాల్లో భాగస్వామిగా ఉండే నాగుర్ల కోసమే బీఆర్ఎస్‌ను గెలిపించాం' అంటూ గ్రామస్తులు స్పష్టంగా చెబుతున్నారు.

### నాగుర్ల రాకతో మారిన సమీకరణాలు

**ఈ తరుణంలో నాగుర్ల వెంకటేశ్వర్లు గ్రామానికి రావడంతో ఒక్కసారిగా పరిస్థితి తారుమారైంది. రెండు రోజుల పాటు గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు విన్న నాగుర్ల బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు.**

# ప్రమాణ స్వీకారంలో రసాబాస!

- చెన్నారావుపేటలో కుర్చీలతో కొట్టుకున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు
- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకున్న ఇరు వర్గాలు



అక్షర దర్బార్, చెన్నారావుపేట : ప్రమాణ స్వీకారం వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కొట్టుకున్న సంఘటన చెన్నారావుపేట గ్రామపంచాయతీ వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఇటీవల జరిగిన మూడో విడత సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుండి కంది శ్వేత రెడ్డి చెన్నారావుపేట గ్రామ సర్పంచ్ గా గెలుపొందారు. ఉప సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీ నుండి దొంతి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం కొద్దిసేపట్లో ప్రారంభం కానుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సంబంధించిన తెలంగాణ పాటలు డీజేలో వస్తుండగా ప్రమాణ స్వీకారం వద్ద బిఆర్ఎస్ పార్టీ పాటలు ఎందుకు పెడుతున్నారని కాంగ్రెస్ నాయకుడు వనపర్తి శోభన్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. అప్పటికే బిఆర్ఎస్ నాయకులు డీజేలో వస్తున్న పాటలను నిలిపివేశారు. అంతలోపే ఇరువురి మధ్య మాట మాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ప్రమాణ స్వీకారం వద్ద ఉన్న కుర్చీలను తీసుకొని ఇరు పార్టీల నాయకులు దాడికి దిగారు. ఈ దాడిలో కాంగ్రెస్ నాయకులు వనపర్తి శోభన్, 10వ బిఆర్ఎస్ వార్డు సభ్యుడు మూడు రమేష్ లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఆసుపత్రికి తరలించారు. దీంతో ఇరు పార్టీలకు చెందిన నాయకులు  పోలీస్ స్టేషన్లో వేరువేరుగా ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. దీంతో చెన్నారావుపేట గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం మండల ఎన్నికల అధికారి, ఎంపీడీవో వెంకటశివానంద్ ప్రమాణస్వీకారం చేయించి వెళ్ళిపోయారు.

# గ్రామాల్లో కొలువుదీరిన
# నూతన పాలకవర్గాలు

## చర్లపల్లిలో సర్పంచ్ రేణుక, ఉప సర్పంచ్ ఎంఎస్ రెడ్డి ప్రమాణ స్వీకారం

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం చర్లపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ గా బండి రేణుక శంకర్, ఏకగ్రీవంగా రెండో వార్డు సభ్యుడు మామిడాల శ్రీనివాసరెడ్డిని ఉపసర్పంచిగా ఎన్నుకున్నారు. సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన బీఆర్ఎస్ నాయకులు, గ్రామ ప్రజలు, వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యమని, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారం, పేదల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. చర్లపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

## నల్లబెల్లి సర్పంచ్ నాగెల్లి జ్యోతి

అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి గ్రామ పంచాయతీలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ నాగెల్లి జ్యోతి ప్రమాణస్వీకారం చేశారు. గ్రామ కార్యదర్శి ధర్మేందర్ ఆమెతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఎండీఓ, సూపరిండెంట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన సర్పంచ్‌కు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, సర్పంచ్ నాగెల్లి జ్యోతి, 12 వార్డుల సభ్యులను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సన్మానించారు.

## ప్రమాణస్వీకార మహోత్సవం

అక్షర దర్బార్ శాయంపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో హుస్సేన్ పల్లి గ్రామ సర్పంచ్ గా గెలుపొందిన ఎడ్ల స్వరూప సుధాకర్ ఉపసర్పంచ్ గా నాగలగాని లక్ష్మణ్ రావు మరియు వార్డు సభ్యులు సోమవారం పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.గ్రామ ప్రత్యేక అధికారులు నూతనంగా ఎన్నికైన సర్పంచులచే, పాలకవర్గ సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## సర్పంచ్ గా వాంకుడోత్ నిరోష, ఉపసర్పంచ్ గా ఎన్నిండ్ల సుదర్శన్ ప్రమాణ స్వీకారం

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు మండలం కాసిందేవి పేట గ్రామంలో సర్పంచ్ గా వాంకుడోత్ నిరోష అమర్ సింగ్, ఉప సర్పంచ్ ఎన్నిండ్ల సుదర్శన్ సోమవారం వారు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, గ్రామస్తులు పాల్గొన్నారు

## చిట్యాల మండలంలో..

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ పాలకవర్గాలు సోమవారం ప్రమాణ స్వీకారం చేసి కొలువు దిరాయి. చిట్యాల మండల కేంద్రంలో తౌటం లక్ష్మీ అత్తయ్య, నవాబు పేటలో పర్లపల్లి రవి ఎలేటి రామయ్య పల్లెలో కోడారి అశోక్ కైలాపూర్ లో కొడారి ఓదెలు పాసిగడ్డ తండాలో లావుడియా రవీందర్ నాయక్ చైన్ పాకలో మాంతరాం మనోహర్ ముచిన్పర్తి సర్పంచ్గా ఇంగ్లీ రాజేందర్ భవశింగ్ పల్లి సర్పంచిగా ఎర్రబెల్లి రాజేశ్వరరావు రామచంద్రపురం లో గాజె హేమలత కాల్వ పెల్లిలో పులి అంజిరెడ్డి లక్ష్మీపూర్ తండాలో భాను స్వప్న గుంటూరు పల్లి లో నాగమల్లేశ్వరరావు దూద్పల్లి సర్పంచ్గా తరాల ప్రమీల చింతకుంట రామయ్య పల్లిలో మట్టికే సుజాత వర్కోల్పల్లి లో పాశం పుష్పలత వెంచరామిలో కాసు రామా అందుకుతండాలో కాసం మాధవి గిద్దముత్తారంలో బుర్ర చంద్రకళ కొత్తపేట గ్రామంలో ఉమ్మనబోయిన పద్మ విడుదలలో బండి భగవాన్ గోపాల్పూర్ లో గొర్రె శశికుమార్ జైలు పేటలో కారు లక్ష్మి నవాబుపేటలో పార్లపల్లి రవి చల్లగరిగలో సిరిపెల్లి జంపయ్య జూకల్లో ఎలగొండ సంధ్యారాణి ప్రమాణస్వీకారం చేశారు.


నల్లబెల్లి సర్పంచ్ నాగెల్లి జ్యోతి ప్రమాణ స్వీకారం..


చర్లపల్లి సర్పంచ్ బండి రేణుక శంకర్ కు శుభాకాంక్షలు


కాసిందేవిపేట సర్పంచ్ వాంకుడోత్ నిరోష ప్రమాణ స్వీకారం..


హుస్సేన్ పల్లి సర్పంచ్ ఎడ్ల స్వరూప సుధాకర్ ప్రమాణస్వీకారం..


జంగాలపల్లి సర్పంచ్ ముడతనపల్లి మోహన్ ప్రమాణ స్వీకారం


వీఆర్కేపురం సర్పంచ్ రమ్య ప్రమాణ స్వీకారం..


చిట్యాల మండలంలో సర్పంచ్ ల పదవీ స్వీకారం


ముచినిపర్తి సర్పంచ్ రాజేందర్ ప్రమాణ స్వీకారం..

## ముచినిపర్తి సర్పంచ్ రాజేందర్..

అక్షరదర్బార్, చిట్యాల: భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ముచినిపర్తి గ్రామ సర్పంచ్ గా ఇంగిలి రాజేందర్ తో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

## వీఆర్కేపురం సర్పంచ్ రమ్య

అక్షర దర్బార్, నూగూరు వెంకటాపురం : వెంకటాపురం మండలం వీఆర్కే పురం గ్రామ సర్పంచ్ గా డర్ర రమ్య సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఉప సర్పంచ్ గా పూనెం రాజేశ్వరి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వాడ బలిజ సేవా సంఘం అధ్యక్షులు డర్ర దామోదర్,రాష్ట్ర అధికార ప్రతినిధి తోట మల్లికార్జున రావు,మాజీ సర్పంచ్ పూనేం శ్రీదేవి, కొప్పుల మల్లయ్య,బద్ది ఆదినారాయణ,కుమ్మరి ఎల్లయ్య,పి మోహన్ రావు, శివాజీ,టేకుల నాగేశ్వరరావు, సనుగొండ శ్రీను పాల్గొన్నారు.

## జంగాలపల్లి సర్పంచ్ ముడతనపల్లి మోహన్

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు మండలం జంగాలపల్లి గ్రామ సర్పంచ్‌గా ముడతనపల్లి మోహన్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. స్పెషల్ ఆఫీసర్ సందీప్ సమక్షంలో సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోహన్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ , గ్రామస్తులు పాల్గొన్నారు

# సమస్యలను పరిష్కరిస్తా

## నారాయణగిరిపల్లి నూతన గ్రామ సర్పంచ్ అన్న రవి



అక్షర దర్బార్, వెంకటాపూర్ : గ్రామ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని నారాయణగిరి పల్లె సర్పంచ్ అన్న రవి పేర్కొన్నారు. సోమవారం గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా సర్పంచ్ బాధ్యతలను స్వీకరించారు. గ్రామ అభివృద్ధికి నిత్యం తోడ్పాటు అందిస్తానని, అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తానని గ్రామంలో పేరుకుపోయిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ తన విధిని నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. నూతనంగా సర్పంచిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# కరాటేలో గీతాంజలి విద్యార్థుల ప్రతిభ

నర్సంపేట, అక్షర దర్బార్ @విద్యార్థులకు చదువుతోపాటు ఆత్మస్థైర్యం కూడా అవసరమని, అది కరాటే పోటీల ద్వారా సాధ్యమవుతుందని గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు అన్నారు.సోమవారం తెలంగాణ, ఏపీ స్టేట్ లెవెల్ షోటా ఖాన్ కరాటేలో గీతాంజలి విద్యార్థుల ప్రతిభ చాటి బహుమతులు సాధించిన గీతాంజలి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ. ఆత్మస్థైర్యంతో ఎలాంటి ఆపదలనైన ఎదుర్కొనే శక్తి వస్తుందనన్నారు. శిక్షణను ఇప్పిస్తున్న కోచ్ వెంకన్నను విద్యార్థులను గీతాంజలి డిజి స్కూల్ ప్రిన్సిపాల్ కొత్తపల్లి ప్రవీణ్ కుమార్ ను చైర్మన్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు సన్మానించారు.



# బాలాజీ టెక్నో స్కూల్లో జాతీయ గణిత దినోత్సవం

అక్షర దర్బార్, నర్సంపేట రూరల్ : లక్నేపల్లిలోని బాలాజీ టెక్నో స్కూల్‌లో శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి హాజరై రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. రామానుజన్ అసాధారణ ప్రతిభతో భారతదేశానికి ప్రపంచ గుర్తింపు తెచ్చారని ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్ పి. రాజేంద్ర ప్రసాద్ “1729”ను రామానుజన్ సంఖ్యగా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. రామ్మూర్తి, కె. రాజు ,ఎమ్. రాజేందర్, ఆశాశ్రీ, సరిత, ఉపేందర్, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# మోరంచపల్లి వాగులో మాక్ డ్రిల్ నిర్వహణ

## వరదల సమయంలో సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

అక్షర దర్బార్, భూపాలపల్లి : వరదల వంటి విపత్తుల సమయంలో జిల్లా యంత్రాంగం సమన్వయంతో వేగంగా స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డిఎంఏ) ఆదేశాల మేరకు సోమవారం మోరంచపల్లి వాగు పరిధిలో వరద విపత్తులను ఎదుర్కొనే విధానాలపై సమగ్ర మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్‌ను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించారు. భారీ వర్షాల కారణంగా వాగులు ఉప్పొంగి వరదలు సంభవించినప్పుడు ప్రజలు, పశువులు నీటిలో చిక్కుకునే పరిస్థితుల్లో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ఈ మాక్ డ్రిల్ ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. వరద సమయంలో జిల్లా యంత్రాంగం తక్షణమే ఎలా స్పందించాలి, వివిధ శాఖలు పరస్పర సమన్వయంతో సహాయక చర్యలను ఎలా అమలు చేయాలి అనే అంశాలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. మోరంచపల్లి వాగులో వరద ప్రవాహంలో చిక్కుకున్న వ్యక్తులు, పశువులను సురక్షితంగా రక్షించే విధానాలు, నీటిలో కొట్టుకుపోయిన వారిని గుర్తించి బయటకు తీసుకురావడం, అవసరమైతే పరిసర కాలనీలను ఖాళీ చేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాలను మాక్ డ్రిల్ ద్వారా వివరించారు. అలాగే అత్యవసర వైద్య, అగ్నిమాపక సేవల పాత్రను కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయ లక్ష్మి , అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, ఆర్డీఓ రవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్, పశుసంవర్ధక శాఖ అధికారి డా. కుమార స్వామి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మధుసూదన్, జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, ఇరిగేషన్ ఈఈ బసవ ప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ తరుణి ప్రసాద్, ఈడీఎం శ్రీకాంత్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# అక్షయ పాత్ర సేవలు అనిర్వచనీయం

- రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఎనుమాములలో అక్షయ పాత్ర సెంట్రల్ హబ్ లో అధునాతన యంత్రాల ప్రారంభం




అక్షరదర్బార్, వరంగల్: పేద విద్యార్థుల ఆకలి తీరుస్తున్న అక్షయ పాత్ర సేవలు అనిర్వచనీయం అని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. వరంగల్ నగర పరిధి 14వ డివిజన్ ఎనుమాములలో ఇస్కాన్ అక్షయ పాత్ర ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమం (సీఎస్ఆర్)లో భాగంగా హెచ్ డీబీ సహకారంతో అధునాతనంగా ఏర్పాటు చేసిన వంటశాల యంత్రాలను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఇస్కాన్ అంటే తెలియని వారు ఉండరని, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్ఠలు పొందిన ఆధ్యాత్మిక సామాజిక సేవా సంస్థ అని అన్నారు. ప్రపంచంలోనే మధ్యాహ్న భోజన పథకాన్ని నడుపుతున్న అతిపెద్ద సంస్థ ఇదేనని అన్నారు. కేంద్రీకృతంగా ఏర్పాటు చేయబడిన వంటశాలలో వండడం ద్వారా లక్షలాది మంది పిల్లలకు భోజనాన్ని అందిస్తున్నారని, గంటలో 40 వేల చపాతీలను తయారు చేసే యంత్ర సామాగ్రి వీరి వద్ద ఉందని అన్నారు. భారతదేశంలో 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న 22 వేల ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు ప్రతిరోజు 20 లక్షల పైచిలుకు విద్యార్థులకు ఆహారాన్ని అందిస్తున్నారని, ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఆహారాన్ని అందిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డా సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య పాల్గొన్నారు.

# పాముకాటుతో రైతు మృతి

అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి మండలంలోని లెంకాలపల్లి గ్రామంలో పాముకాటుతో రైతు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన యాదండ్ల చిన్న కొమురయ్య (50) తన వ్యవసాయ భూమిలో మక్కజొన్న సాగు చేస్తున్న సమయంలో ఎడ్లకు మేత వేస్తుండగా విష సర్పం చేతికి కాటు వేసింది. తక్షణమే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు 108 ద్వారా వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య అరుణ, కుమారులు మునేందర్, రాజేందర్ ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై వి. గోవర్ధన్ తెలిపారు.



# నర్సంపేటలో అలుగు ప్రత్యక్షం

## ఫొటోలు, వీడియోలు తీసిన స్థానికులు

అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట పట్టణంలో సోమవారం తెల్లవారుజామున అరుదైన అలుగు ప్రత్యక్షమై స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. నాగమయ్య గుడి వద్ద డివైడర్ వెంబడి కదులుతూ మున్సిపాలిటీలోని రెండో గేటు లోపలికి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఆ ప్రాంతం నీరు, మురికి చెట్లతో నిండి ఉండటంతో దానిని పట్టుకునేందుకు ఎవరూ సాహసించలేదు. సాధారణంగా దట్టమైన అడవుల్లో ఉండే అలుగు పట్టణంలో కనిపించడంతో స్థానికులు వీడియోలు, ఫొటోలు తీశారు. అలుగు చిప్పలకు అధిక విలువ ఉండటంతో పాటు ఔషధ తయారీలో ఉపయోగిస్తారని పలువురు తెలిపారు. చీమలు, చిన్న కీటకాలను ఆహారంగా తీసుకునే అలుగు సుమారు 5 కిలోల బరువు ఉంటుందని చెబుతున్నారు. పట్టణంలో అలుగు కనిపించడం చర్చనీయాంశంగా మారింది.

# గ్రామ సమస్యలను పరిష్కరిస్తా

## నారాయణగిరిపల్లి నూతన గ్రామ సర్పంచ్ అన్న రవి

అక్షర దర్బార్, వెంకటాపూర్: గ్రామ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని నారాయణగిరి పల్లె సర్పంచ్ అన్న రవి పేర్కొన్నారు. సోమవారం గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా సర్పంచ్ బాధ్యతలను స్వీకరించారు. గ్రామ అభివృద్ధికి నిత్యం తోడ్పాటు అందిస్తానని, అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తానని గ్రామంలో పేరుకుపోయిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ తన విధిని నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. నూతనంగా సర్పంచిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# పద్మశాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల పరిధిలో పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని నూతనంగా పద్మశాలి సంఘానికి మండల అధ్యక్షులుగా ఎన్నికైన పిట్ట సురేష్ బాబు తెలిపారు సోమవారం మండల కేంద్రంలో ఆయనను మాజీ జెడ్పిటిసి గొర్రె సాగర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి గొర్రె సాగర్ మాట్లాడుతూ మండలంలో పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ వారికి వెన్నుదన్నుగా నిలవాలని సాగర్ కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మాజీ సర్పంచ్ ఇరుకులపాటి పూర్ణచందర్రావు ఏలేటి రామయ్య పల్లి మాజీ సర్పంచ్ ఏలేటి రాజు, నాయకులు చేరి రవీందర్, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు జన్నే యుగేందర్ గారు, లండే శంకర్ రావు, సరిగమ్ముల రాజేందర్, రాంపిస లింగరావు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# కరదీపికను ఆవిష్కరించిన సీఎం



అక్షరదర్బార్, హైదరాబాద్: గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధుల కరదీపికను సోమవారం హైదరాబాద్ లో ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. రాష్ట్ర మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పంచాయతీరాజ్ చట్టం–2018, గ్రామపంచాయతీల విధులు, బాధ్యతలకు సంబంధించి సమగ్ర సమాచారంతో 292 పేజీల పుస్తకాన్ని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ (టీజీఐఆర్డీ) రూపొందించింది. గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వం ఈ కరదీపికను అందించనుంది.

# ఏఐడీఏసి జిల్లా అధ్యక్షుడిగా తంగెళ్ల నవీన్ రెడ్డి



అక్షరదర్బార్, పరకాల: ఆల్ ఇండియా దళిత్ యాక్షన్ కమిటీ (ఏఐడీఏసి) హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా నడికూడ మండలం నర్సక్కపల్లె గ్రామానికి చెందిన తంగెళ్ల నవీన్ రెడ్డిని నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర ఏఐడీఏసి అధ్యక్షులు రత్నం శైలేందర్ తెలిపారు.పేదవర్గాల సామాజిక చైతన్యం, ఆర్థికాభివృద్ధి కోసం అన్ని కులాల ప్రజలకు సమన్యాయం కల్పించాలనే లక్ష్యంతో నిరంతరం పనిచేస్తున్నందున ఆయనను జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. తనను గుర్తించి జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు రత్నం శైలేందర్‌కు, జాతీయ అధ్యక్షులు డా. చినారాముకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.





# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915